# సంగీత

సంగీత పుట్టగానే తల్లిదండ్రులు రామనాథం సీతామహాలక్ష్మి ఆనందానికి పట్టపగ్గాల్లేవు. సుప్రభాత వేళ, సూర్యోదయం అవుతూ ఉంటే శుక్రవారం పౌర్ణమి, చిత్తా నక్షత్రంలో పుట్టిందనీ, అన్నీ శుభసూచకాలేననీ, అదిగో కోయిలకూస్తోంది అనీ ఆనందపడ్డారు. చంద్రబింబంలాగ ముఖం వెలిగిపోతోంది, దీని గీత భగవంతుడు చాలా గొప్పగా రాసివుంటాడు అని గీత పేరు పెడితే ఎలాగుంటుంది అని ఆలోచించారు.

మరీ గీత అంటే బాగాలేదు అనుకుని తర్జనభర్జన చేసి చివరకు గీత పేరు వచ్చేటట్టు సంగీత అని నామకరణం చేసారు.

సంగీత, అందంగా ఆనందంగా అపురూపంగా ఎదిగింది. తల్లిదండ్రుల కోరిక ప్రకారం, సంగీత సంగీతం నేర్చుకోవడం మొదలెట్టింది-అక్షరాభ్యాసానికంటే ముందుగానే.

ఒకే ఒక్క కూతురు కనుక అల్లారుముద్దుగా పెంచారు.

ఉదయం, సాయంకాలం సంగీతసాధన, స్కూలు టైముకి స్కూలుకి వెళ్లిరావడం అలవాటైంది.

మగరాయుడిలాగా చదువు ఉద్యోగమే కాదు, ఆడపిల్లంటే ఎన్ని నేర్చుకోవాలి?

పూలు కోయడం ఒక కళ, వాటిని అందంగా మాల కట్టడం ఒక కళ. అడుగడుగునా ఆడపిల్ల కళా హృదయంతో పెరగాలి.పాట మాట నడవడిక హృదయాన్ని పదిలంగా దాచుకోగలగాలి.ఏ యువకుడో వయసులో ఉన్నాడని మనసు పారేసుకోకూడదు.పదిలంగా భర్తకి అందించ గలిగేటట్టు ఉండాలి.అని తల్లి సీతామహాలక్ష్మి సంగీతని ఎంతో నేర్పుతో పెంచింది.

సంగీత తల్లి మాటని గౌరవిస్తూ తండ్రిని గౌరవిస్తూ ఆ ఇంట్లో సంగీత సరస్వతిలాగా పెరిగి పెద్దదైంది.

మంచి నిర్ణయాలు ఎప్పుడూ సంతోషాన్ని కలిగిస్తాయి.ఎప్పుడూ సంగీత సాధన, మంచి పుస్తకాలు చదవడం, స్నేహితులతో కొంతసేపు కబుర్లు ఇలా కాలం గడిచిపోతోంది. సంగీతకి హైస్కూలు చదువుతో చదువు మానిపించేసారు.తన స్నేహితులు కాలేజీలో చదువుతున్నారని, తనూ చదువుతాననీ అడిగింది సంగీత. ససేమిరా ఒప్పుకోమన్నారు. కారణాలు చాలా చెప్పారు. ఎక్కువ చదివిస్తే పెద్ద చదువులున్న అల్లుణ్ణి కట్నం ఇచ్చి

పెళ్లి చేయలేమనీ, అసలే అందమైన అమ్మాయివి, ప్రేమించానని ఎవరైనా వెంటబడితే మాకు అప్రదిష్ట అనీ, ప్రతి ఫంక్షన్‌కూ నిన్నే ప్రార్థన చెయ్యమని అడిగితే అందరి కళ్లూ నీమీదే పడతాయి. దిష్టి అనీ ఇలా రకరకాల కారణాలతో, మొత్తంమీద చదువు మానిపించి సంగీత పాడుతోంటే వింటూ పనీ పాటా వంటా వార్పూ రావాలని చెప్పి సంగీతని మాట్లాడనివ్వలేదు.

తల్లిదండ్రులమీద ప్రేమకొద్దీ చదువు మానింది సంగీత. సంగీతం నేర్చుకోవడం సులువేగాని, దానిని సాధన చెయ్యడంలోనే ప్రతిభ కనబడుతుంది.

ఎప్పుడైనా ఫ్రెండ్సు వచ్చి కబుర్లు చెప్పి కాలేజీలో సంగతులతో సరదాగా గడుపుతారు.వెళ్లబోయేముందు ఒకపాటవిని మరీ వెడతారు.సంగీతకి తన జీవితం పట్ల ఏ అవగాహనా లేదు. నిత్యం సంగీతసాధన చేస్తోంది.

మార్పు మానవ జీవితాలకి సోపానం. ఇంత బాగా పాడుతున్నావు రేడియో ఆడిషన్‌కి అప్లయి చెయ్యమని, స్నేహితులు తరుచు అడుగుతూ ఉండేవారు.ఆలోచిద్దాం అని కొన్నాళ్లు ఆలస్యం చేసింది.

అయినా ఫ్రెండ్స్ ఊరుకోలేదు. ఆడిషన్ ఫారం పట్టుకొచ్చి ఫిలప్ చేయించి రేడియోకి పోస్ట్ చేసారు.

ఒకరోజు ఇద్దరు పెద్దమనుషులు వచ్చి "రామనాధంగారు ఉన్నారా" అని అడిగారు సంగీతని. "ఉన్నారండీ మా నాన్నగారు. పిలుస్తాను మీరిలా కుర్చీలో కూర్చోండి. మంచి తీర్థం కావాలా"అని అడిగింది.

వచ్చినవారు సంగీతని చూస్తూ నవ్వుతూ "వద్దమ్మా! చాలా సంతోషం అడిగినందుకు"అంటూ కుర్చీలో కూర్చున్నారు.

"ఏమిటిలా వచ్చారు?"అంటూ రామనాధంగారు మరో కుర్చీలో కూర్చుంటూ అడిగారు.

"మేం ఒక పనిమీద వచ్చాం. చెప్తాం కాని అమ్మాయిని ఎంత బాగా పెంచారు? రాగానే నవ్వుతూ పలకరించి, మంచినీళ్లు కావాలా అని అడిగింది. ఈ కాలం పిల్లలు ఇలా కుదురైన పెంపకం ఏంలేదు."అన్నారు.

ఆ మాటలకి రామనాధం నవ్వుకుంటూ"భలేవారే మీలాంటి పెద్దలు వచ్చినప్పుడు ఇంటి మర్యాద కదండీ"అన్నారు.

"సరే, అమ్మాయికి సంగీతం చెప్పించారని తెలిసింది. బాగా పాడుతోందని కూడా అంతా చెప్పుకుంటున్నారు."

"అలాగటండీ! సంతోషం. ఇంతకీ మీరు ఏం పనిమీద వచ్చారు?"అన్నారు.

"అబ్బే మరేం లేదు. రేపు శ్రీరామనవమి కదా!మన వీధి చివర పందిరి వేసి రామ కల్యాణం చేస్తున్నాం. సాయంకాలం మీ అమ్మాయి సంగీతచేత నాలుగు త్యాగరాజకృతులు పాడిస్తే బాగుంటుందనీ..."అన్నారు.

"మీరు అడిగింది బాగానే వుంది. కానీ అమ్మాయి సభాముఖంగా పాడగలదో లేదో అడుగుతాను."అన్నారు రామనాధంగారు.

సంగీతని పిలిచి అడిగారు.

"నాకు పాడాలనేవుంది కాని కొంచెం భయం..బిడియంగానూ వుంది."అంది.

"ఆ...అంతా మనవారేకదమ్మా! నాలుగు కాకపోతే రెండు పాడు. అలవాటౌతుంది"అన్నారు.

సంగీత అమ్మనడిగి చెప్తానని తల్లి దగ్గరకు లోపలికి తుర్రుమని పారిపోయింది.

"చిన్నపిల్ల"అని నవ్వుకున్నారు.

సీతా మహాలక్ష్మి వచ్చి "నమస్కారం! మీరు మా అమ్మాయిని పాడమని అడగడం చాలా సంతోషం. నేను అమ్మాయికి చెప్పి ఒప్పించి తీసుకు వస్తాను."అని చెప్పింది.

అయితే సరేనంటూ వచ్చినవారు వెళ్లారు.

మర్నాడు శ్రీరామనవమి పందిట్లో సాయంకాలం సంగీత పాడటానికని వచ్చింది. ఇరుగూపొరుగూ వచ్చారు. శ్రీగణనాథంతో మొదలెట్టి త్యాగరాజ కీర్తనలు మైకుముందు కూర్చుని పాడింది.

శృతి పర్వంగా పాడడంతో వచ్చినవాళ్లంతా ఆనందించారు.

"ఏమిటి నదురూ బెదురూ లేకుండా ఇంత చక్కగా పాడావు?" అని తల్లీదండ్రీ ఆనంద పడిపోయారు.

అంతా మెచ్చుకోవడమే.మైకు దగ్గర కుదురుగా కూర్చోవడం దగ్గర్నుంచి ఎంతో ముచ్చటగా పాడింది అని అంతా ఆనందించారు.

ఇంక ఆ మర్నాటినుంచీ "మా అమ్మాయికి నేర్పించండి అంటూ తమ పిల్లల్ని తీసుకు వచ్చి ట్యూషన్‌కి చేర్పించేసారు.

దాంతో సంగీత చాలా బిజీ అయిపోయింది. అటు డబ్బూ వస్తోంది.ఇటు కాలక్షేపమూ అవుతోంది.

ఒకరోజున పోస్టులో రేడియో ఆడిషన్‌కి రమ్మని పిలుపు వచ్చింది.

"నెగ్గడం ఓడడం తరవాత సంగతి. వెళ్లి ఆడిషన్ పూర్తి చేసుకుని రావడమే" అంటూ స్నేహితుల ప్రోద్బలంతో సంగీత ఆడిషన్‌కి వెళ్లింది.ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారివి, భారతీయ మహిళంటే అనే గేయం, దేవులపల్లివారివి కలిపి పాడింది.అంతే ఆడిషన్‌లో నెగ్గింది.

తరచు రేడియోలో పాడుతూండడం వల్ల తెలిసున్న వారంతా పొగడడం ఆశీస్సులు అందించడం మొదలయ్యాయి.

"సరే బాగానే ఉంది. మనసరదా. పిల్లకి పెళ్లీడు వచ్చింది"అని భర్త రామనాధంగారితో తమలపాకులు చిలకలు చుట్టిస్తూ అంది సీతామహాలక్ష్మి.

భార్య మాటలకు చిరునవ్వులు చిందిస్తూ-

"నువ్వు చెప్పిన విషయమే నేనూ ఆలోచిస్తున్నాను ఈ మధ్యన. కాని నాదా పెద్ద ఉద్యోగం కాదు. అమ్మాయికా పెద్ద చదువు లేదు.ఏంచూసి వస్తాడు పెళ్లికొడుకు? ఈ రోజుల్లో అమ్మాయిలకు పెళ్లి కావాలంటే పెద్ద చదువు చదువుకుని ఉద్యోగమైనా చెయ్యాలి. లేదా కట్నాలూ కానుకలూ ఇళ్లూ తోటలూ అయినా రాయాలి.ఎలా చెప్పు? ఏదో ఒక సంబంధం అని పెళ్లి చేసేస్తే ఆ తర్వాత మనమే కదా సాయం చెయ్యాలి! "అన్నారు రామనాధంగారు.

"స్నేహితుల్ని సలహా అడగండి.-మన పరిస్థితికి తగ్గ సంబంధం చెప్పమని.తప్పక సాయం చేస్తారు.ఈ రోజుల్లో బంధువులకంటే స్నేహితులే నయం"అంది సీతామహాలక్ష్మి.

"సరే చూద్దాం..దేనికైనా సమయం రావాలి కదా!"అన్నారాయన.

ఒకటి రెండు సంబంధాలు చూసారు. కాని వాళ్లకు పిల్ల నచ్చలేదనో, స్థితిగతులు నచ్చలేదనో ఖచ్చితంగా చెప్పేసారు.

ఆ మాటలకు సంగీత మనసు చిన్నబోయింది.కట్టిన పూలు వాడినట్లు దిగులుగా అయిపోయింది. చెట్లకేసీ, ఆకాశంకేసీ చూస్తూ, అంతు చిక్కని ఆలోచనల్లో ఉండిపోతోంది. కూతుర్ని చూసి ఆ తల్లిదండ్రులు ఆలోచనల్లో పడ్డారు.

వయసులో ఉండగా పెళ్లిచేయడం ఒక అందం, తమ బాధ్యతాను.
అయితే పిల్ల నచ్చింది అంటే కట్నకానుకలకి ఆఫీసు లోన్, ఇంటిమీద కొంత అప్పు తీసుకు రావచ్చును.కాని ఏదీ?ఏ సంబంధం చూసినా ఏదో ఒక వంక పెట్టి వెళ్లిపోతున్నారు.ఈ కాలం పిల్లలకి సంగీతం అభిరుచి బొత్తిగా లేదు. ఏం చదువుకుంది? ఎంత జీతం తెస్తుంది? కాబోయే భార్య సినిమా యాక్టర్‌లా వుందాలేదా అనే అలోచనలేను. కళాభిరుచి లేదు.అనుకుని ఆఖరికి భగవంతునిపై భారమేసి తమ వంతు ప్రయత్నాలూ మానకుండా చేస్తున్నారు.
సంగీతకు సరదాలెన్ని వున్నా ఈ కాలపు పిల్లల్లాగా కాదు. తాహతుకి మించిన ఆలోచనలు, కోరికలూ, తనకలాంటివాడు కావాలి ఇలాంటివాడు బాగుంటాడు అనే దురాశ లేదు.అసలా మాటకు వస్తే, సంగీతంలో ఎక్కువ కృషి చేసినవారి కేసెట్లు తెచ్చుకుని, అవి విని ఇంకా బాగా పాడాలని ప్రయత్నం చేస్తుంది.
ఏ కళైనా, మనోభావాలవల్లే రక్తి కడుతుంది.
ఒకరోజున కాకినాడనుండి లెటర్ వచ్చింది. సరస్వతీ గానసభల్లో ఒకరోజు పాడటానికి ఆహ్వానం.
"మీ గానం తరచుగా రేడియోలో వింటున్నాం.శాస్త్రీయంగా బాగా పాడుతున్నారు.అని మా కమిటీ ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు"అని రాసారు.
సంగీత ఆనందం చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు.
ఇంకా జాగ్రత్తగా టైముని సంగీత సాధనకు వినియోగించింది.
సరే అనుకున్న ప్రకారం సరస్వతీ గానసభలో పాడ్డానికి తల్లిదండ్రులతో సహా వెళ్లింది.
పాటకచేరీ అయినంతసేపు హాల్లో జనం ఆనందంతో వినసాగారు.
"ఇక్కడికి వచ్చి పాటకచ్చేరీ చేసేవారిలో నా అనుభవం చాలా తక్కువ. అయినా మీరంతా ఇంత ఓర్పుగా విన్నందుకు నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను."అని నమస్కారం పెట్టేటప్పటికి హాలంతా చప్పట్లు కొట్టారు.
"ఈ సభకి పిలిచి పాడమని అడిగారు అంటే ఒక అవార్డు వచ్చినంత ఆనందంగా వుంది"అంది సంగీత.
మళ్లీ ఆనందంతో చప్పట్లు...కొంతమంది దగ్గరగా వచ్చి అభినందనలు తెలిపారు.
టి.వి.వాళ్లు వచ్చి కవరేజ్ చేసారు.అదికాక వేరే సంస్థవారు కేసెట్ తీయించారు.
రామనాధంగారికీ సీతామహాలక్ష్మికీ ఆనందంతో కళ్లు చెమర్చాయి.

కొందరు దగ్గరగా వచ్చి 'ఇంకా కృషి చెయ్యి. ఎమ్. ఎస్ సుబ్బులక్ష్మి అంత పేరు తెచ్చుకో'
అన్నారు.
ఒక పండు ముత్తయిదువ కుర్చీలోంచి లేవలేక లేవలేక లేస్తోంటే కార్యకర్తలు,
"అమ్మా! మీరు లేవకండి. ఆ అమ్మాయిని మేము మీ దగ్గరకు తీసుకు వస్తాము" అని సంగీతతో-
"ఆమె మా ట్రస్టులో ఎక్కువ విరాళం ఇచ్చినవారు. ఆమె దగ్గరకి వెళ్లి ఆమె ఆశీస్సులు తీసుకుంటే బాగుంటుంది" అని చెప్పి సంగీతని ఆమె దగ్గరకి తీసుకువెళ్ళారు.
సంగీత తల్లిదండ్రులు కూడా వెళ్ళారు. "ఈ అమ్మాయికి ఇంత బాగా సంగీతం చెప్పించినవారు అంటూ రామనాధంగారూ, సీతామహాలక్ష్మిగారు" అని పరిచయం చేశారు.
"పెద్దామెకి కాళ్ళకి దణ్ణం పెట్టమ్మా" అన్నారు.
"దీర్ఘాయుష్మాన్ భవ" అని ఆశీర్వదిస్తూ, సంతోషంతో చిరునవ్వు నవ్వుతూ-
"నా చిన్నప్పుడు నేనూ సంగీతం నేర్చుకున్నాను. కానీ ఆ రోజుల్లో ఆడపిల్లవి అని పాటకచేరీలకి పంపేవారు కాదు. ఇప్పటి ఆడపిల్లలకి అన్నీ అవకాశాలే. అటు ఉద్యోగం, ఇటు కళలు, చదువులు. ఎంతగానో అభివృద్ధి చెందారు" అంది ఆమె.
వెంటనే సీతామహాలక్ష్మి, "మీరు పెద్దలు. లోకం చూసిన అనుభవంతో చెబుతున్నారు. కానీ ఒక్కమాట. మా అమ్మాయికి మంచి సంబంధం ఉంటే చెప్పండి" అంది.
ఆమె నవ్వుతూ, "అలాగే. మీ అడ్రసిచ్చి వెళ్ళండి" అంది.
"అమ్మా ఏమిటే. ఎక్కడికొచ్చినా........" అంటూ గారాలుపోయింది సంగీత సిగ్గుపడుతూ.
"ఆ టైము వస్తుంది. మంచి మొగుడు వస్తాడు" అంది ఆమె.
ఆ తరువాత ఎవరి పనుల్లో వారుండిపోయారు.ఏవో సంబంధాలొస్తున్నాయి. రకరకాల కారణాలవల్ల తప్పిపోతున్నాయి.
ఒకరోజు సంగీత రకరకాల పూలు పెరట్లోవి కోసుకొచ్చి కదంబ మాల కట్టి హాల్లో ఉన్న సరస్వతీదేవి ఫోటోకి వేసి నుదుట కుంకుమ పెట్టి మనసా నమస్కరించింది భక్తితో. వీధిలోంచి పోస్ట్ అన్న కేక వినబడి, తలుపుతీసి కవరందుకుని, ఎవరు రాసి ఉంటారో అనుకుని కవరు అటూ ఇటూ తిప్పుతూ చూసింది. ఫ్రమ్ అడ్రసు

చదివింది.కాకినాడ వరకూ అర్ధమయింది.

"ఎవర్రాశారు ఆ కవరు" అంటూ సీతామహాలక్ష్మి వచ్చి సంగీతనడిగింది.

" ఏమో ఇంకా తీసి చదవలేదు" అంటూ తీసి చదివింది.

వెంటనే 'నువ్వు చదువు'అని ఇచ్చి పెరట్లో పూలమొక్కలకేసి వెళ్లిపోయింది సంతోషంతో.

ఆ కవరు చదివి సీతామహాలక్ష్మి భర్త రామనాధంగారితో చెప్పింది.

"ఆవేళ మనకు సరస్వతీగానసభలో కనిపించారు..ఆ పెద్దామె వ్రాసారు. వాళ్లు రేపు మనింటికి వస్తున్నారుట పిల్లని చూసుకుందుకు. వాళ్ల అబ్బాయే పెళ్లికొడుకుట. ఏవిషయం ఈ నెంబరుకి ఫోన్ చెయ్యండి అని వ్రాసిందావిడ."

ఆ మాటలు రామనాధంగారికి ఆనందంగా సన్నాయిపాటలా వినిపించాయి.

"ఇంత మంచివాళ్లుంటారా లోకంలో.అంత డబ్బున్నవాళ్లు.అయినా నాకు అనుమానం. ఆవిడ మాటవిని భర్త, కొడుకు వస్తున్నారంటే వాళ్లింట్లో ఆడ పెత్తనమేమోనని..."అని ఛలోక్తిగా నవ్వారు.

"భలేవారే. మంచి సంబంధం వస్తూంటే ఇలాంటి అనుమానాలేమిటి?ఇప్పుడు ఆడపెత్తనం వాళింట్లో ఉంటే రేపు మనమ్మాయి వెళ్లాక ఆడపెత్తనం సాగుతుంది. అదే మంచిది,"అంది సీతామహాలక్ష్మి.

"మాకు మీరు రావడం చాలా సంతోషం మీకోసం ఎదురు చూస్తున్నాం'అని ఫోన్‌లో చెప్పారు.అనుకున్న ప్రకారం వచ్చారు పెళ్లివారు."మావారు కామేశ్వరరావుగారు. మా అబ్బాయి గణేష్ నా పేరు కామాక్షి అంటారు"ఛలోక్తిగా పరిచయం చేసుకున్నారు కామాక్షిగారు.

అంతా హాల్లో కూర్చున్నాక, కాఫీ ఫలహారాలు అయ్యాక 'అమ్మాయిని తీసుకు రండి,'అన్నారు.సంగీత సింపుల్‌గా తయారై హాల్లోకి వచ్చి అందరికీ నమస్కారం చెప్పింది.

"ఇలా నా దగ్గర కూర్చో అమ్మా! "అంది కామాక్షమ్మగారు.

బిడియపడుతూ ఆమె ప్రక్కన కూర్చుంటూ. ఓరకంట గణేష్‌కేసి చూసింది. చిరునవ్వుతో కొంటె ఆలోచన వచ్చింది.

"గణేష్ అంటే బొజ్జ అదీ ఉంటుందనుకున్నాను.బాగానే ఉన్నాడు"అనుకుంది.

గణేష్ ఆ అమ్మాయి ఓరచూపు చూసి.

"ఓ గడుగ్గాయే ఓరచూపులతోనే ఆకట్టుకుంటోంది. ఏదో పల్లెటూరి పిల్ల అనుకున్నాను.

సింపుల్‌గా స్లిమ్‌గా తయారయింది"అనుకున్నాడు.

రామనాథంగారు చేతులెత్తి నమస్కరిస్తూ "మా ఇల్లూ, స్థితిగతులూ చూసి కొందరు వెళ్లిపోతున్నారు.మా మంచి చెడ్డలివీ అని అన్నీ విపులంగా చెప్పారు.

"దానికేముంది? డబ్బు శాశ్వతం కాదు. సంప్రదాయం మాట, మంచితనం కావాలి"అంది కామాక్షమ్మ. కామేశ్వర్రావుగారు కూడా అవును అంటూ సమర్థించారు.

"మేమిద్దరం ఒక నిమిషంపాటు మాట్లాడుకోవాలి" అన్నాడు గణేష్.

ఓ అల్లాగే అన్నారు పెద్దలు.సంగీత, గణేష్ మాట్లాడుకున్నారు.ఒకరి గురించి ఒకరు తెలుసుకున్నారు.కాని సంగీతకి కొంచెం భయమేసింది.

"ఇంత పెద్ద చదువు చదువుకున్నారు.ఎమ్.టెక్. యం.బి.ఏ. డబ్బున్నవారు. నేను మీకు తగుదునా?" అని అడిగింది.

కొంచెం నవ్వి, "నాదగ్గర విద్య వుంటే నీ దగ్గర సంగీతం వుంది. రెండూ సరస్వతీ కటాక్షమేగా!" అన్నాడు. ఆనందంగా తల ఊపింది.

"నాకు నువ్వంటే ఇష్టం. మా అమ్మానాన్నకు నీ సంగీతం ఇష్టం"అన్నాడు గణేష్.

ఇద్దరికీ అంగీకారంతో కళ్యాణం వైభవోపేతంగా జరిగింది.సంగీత అదృష్టవంతురాలే అని స్నేహితులంతా ఆనందించారు.రామనాథం సీతామహాలక్ష్మి కన్నులు ఆనందంతో నిండాయి.

❄❄❄

(రేడియో 2000)

కథా నిలయం
55593
శ్రీకాకుళం